క్లుప్తంగా

జాదవ్ సుభాష్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: హనుమకొండకు చెందిన జాదవ్ సుభాష్‌కు ఏపీ అనంతపూర్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ (అనంతపురం, జేఎన్‌టీయూ) డాక్టరేట్ ప్రకటించింది. ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగంలో పరిశోధకుడిగా డిజైన్ డెవలప్‌మెంట్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ గ్యాస్ట్రొరెంటేటివ్ డ్రగ్ డెలివరీ సిస్టమ్స్ ఆఫ్ లోరాటాడిన్ అండ్ ఫెల్లోడిపిన్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి జాదవ్ సుభాష్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆ యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూయేషన్ ప్రొఫెసర్ కేశవరెడ్డి ప్రకటించారు. కాగా, హనుమకొండ జిల్లాలోని ఉనికిచర్లలోని శ్రీకాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో సుభాష్ అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం



కాజీపేట రూరల్: కాజీపేట అంబేడ్కర్‌నగర్‌లోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి నేషనల్ ఐరన్ జిమ్ సెంటర్ నిర్వాహకుడు, నేషనల్ పవర్ లిఫ్టింగ్ అథ్లెటిక్ ఎండీ.జాఫర్ శనివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను అంబేడ్కర్ స్ఫూర్తితో అంచలంచెలుగా నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీల వరకు ఎదిగి గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించినట్లు వివరించారు. కార్యక్రమంలో మొలుగూరి ఈశ్వర్, మంద శ్రీనివాస్, నల్ల వెంకటస్వామి, ఆకాష్, విఘ్నేష్, జన్ను ప్రవీణ్, ఇసెంపల్లి కరుణాకర్, శేషాద్రి సందీప్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో చేర్పించాలి



వరంగల్: డివిజన్‌లో 3నుంచి 6ఏళ్ల వయస్సు గల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని స్థానిక కార్పొరేటర్ సురేష్‌కుమార్‌జోషి సూచించారు. 13వ డివిజన్‌లో అంగన్‌వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం, పాలు, బాలామృతం, గుడ్లు వంటి బలవర్ధకమైన ఆహారం ఇస్తారని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

మోడల్ శ్మశాన వాటికలో భారంగా అంత్యక్రియలు

హన్మకొండ: హనుమకొండ వాజ్‌పేయినగర్‌లోని మోడల్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు భారంగా మారాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ధరావత్ భానునాయక్ తెలిపారు. ఇక్కడ దహన సంస్కారాలు చేయాలంటే రూ.6 వేలు ఖర్చవుతోందని, అంత పెద్దమొత్తం చెల్లించే స్తోమత నిరుపేదలకు లేదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈక్రమంలో చార్జీల చెల్లింపులో నిరుపేదలకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. లేదా నామమాత్రపు చార్జీలు నిర్ణయించాలని సూచించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాణ్యమైన విద్య



కరీమాబాద్: రంగశాయిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీనియర్ అధ్యాపకులతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. కళాశాలలోని సౌకర్యాలు, సేవలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను కళాశాలలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని గుర్తుచేశారు. అందులో భాగంగా రంగశాయిపేట ప్రభుత్వ కళాశాల సొంత భవన నిర్మాణం కోసం స్థలం కూడా కేటాయించినట్లు తెలిపారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, బస్ సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు వివరించారు.

బదిలీల్లో పైరవీ విరమించుకోవాలి

కాశోజీ సెంటర్: కేజీబీవీల్లో బదిలీలకు పైరవీలు విరమించుకోవాలని టీఎస్ యూటీఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు తాటికాయల కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దం వెంకటరెడ్డి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేజీబీవీల బదిలీల్లో ఆన్‌లైన్ ఆప్షన్ ఇచ్చుకునే సమయానికి ఖాళీలను బ్లాక్(మాయం) చేయడం సరికాదని పేర్కొన్నారు. పర్వతగిరి స్పెషల్ ఆఫీసర్ బదిలీ కాకుండా ఆ పోస్టు ఖాళీ చూపించడం, ధర్మసాగర్ స్పెషల్ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉంటే బ్లాక్ చేయడం ద్వారా పర్వతగిరి ఎస్‌ఓను అక్రమంగా ధర్మసాగర్ కేజీబీవీకి బదిలీ చేయడానికి చేస్తున్న ప్రయత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమాలను ఆపకపోతే నిరసన ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించండి



మడికొండలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు



కాజీపేటలో బడిబాట ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు



కరీమాబాద్‌లో కరపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు



హసన్‌పర్తి: ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మడికొండ: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మడికొండ మండల పరిషత్ పాఠశాల హెచ్‌ఎం మల్లారెడ్డి కోరారు. ఈమేరకు బడిబాట కార్యక్రమంలో భాగంగా మడికొండలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోమల్‌రెడ్డి, రాజేశ్వరి, రమేష్‌బాబు, అరుణ, కమల, హైమావతి, అంగన్‌వాడీ టీచర్లు వెంకటలక్ష్మి, మల్లీశ్వరి, రజిత, రాజమణి, లలిత, కవిత, మంజుల, వసుంధర పాల్గొన్నారు.
రాంపూర్‌లో ఎంపీపీఎస్ పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సమ్మయ్య, ఉపాధ్యాయులు లక్ష్మి, అరుణ, అంగన్‌వాడీ టీచర్లు మంజుల, సంధ్య పాల్గొన్నారు.

కాజీపేటలో..

కాజీపేట: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని హెచ్‌ఎం మామిడాల రాజేంద్రం అన్నారు. కాజీపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు.

కాశిబుగ్గలో..

కాశిబుగ్గ: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కాశిబుగ్గ నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గుడిబడి) హెచ్‌ఎం కుంట రవికుమార్ కోరారు. కాశిబుగ్గ గుడిబడి ఉపాధ్యాయులు ఐదు గ్రూపులుగా విడిపోయి అడ్మిషన్ల కోసం పలు కాలనీల్లో తిరిగారు. ఉపాధ్యాయులు అజయ్‌బాబు, శ్రవణ్‌కుమార్, కుమారస్వామి, వీరభద్రం, కలీం మహ్మద్ పాల్గొన్నారు.

కరీమాబాద్‌లో..

కరీమాబాద్: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతూ కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ దుర్గం రవి ఆధ్వర్యంలో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి విద్య ప్రాముఖ్యత, పాఠశాలలో విద్యాబోధన తీరును వివరించారు. అనంతరం డాక్టర్ రవి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్నిరకాల సౌకర్యాలున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాములు, అహ్మద్ పాషా, అరుణ్, శోభారాణి, శారద, కల్పన, రాజ్యలక్ష్మి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

హసన్‌పర్తిలో..

హసన్‌పర్తి: బడి బాట కార్యక్రమంలో భాగంగా కోమటిపల్లి ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.నరేష్, విద్యాకమిటీ చైర్మన్ రజనీకాంత్, ఉపాధ్యాయుడు రవి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

బ్రిజ్‌భూషణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలి

హన్మకొండ: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని డీవైఎఫ్‌ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి దొగ్గెల తిరుపతి డిమాండ్ చేశారు. బ్రిజ్‌భూషణ్ సింగ్‌ను అరెస్టు చేయకపోవడాన్ని నిరసిస్తూ డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం కూడలిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ 49 రోజులుగా రెజ్లర్లు ఢిల్లీలో ఆందోళన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం, వారి పోరాటాన్ని అణిచివేయాలని చూడడం సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. ప్రపంచ స్థాయిలో క్రీడల్లో దేశ ప్రతిష్టలు కాపాడుతూ పతకాలు తీసుకొస్తున్న వారిపై లైంగిక వేధింపులు పాల్పడడం దుర్మార్గమని ఎద్దేవాచేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు నోముల కిషోర్, జిల్లా సహాయ కార్యదర్శి చిట్యాల విజయకుమార్, సోషల్ మీడియా కన్వీనర్ చిలక జంపన్న, నాయకులు శివరాత్రి కరుణాకర్, సముద్రాల అనిల్, అనంతగిరి దేవేందర్, బుస్సా పద్మాకర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిజ్‌భూషణ్ సింగ్ దిష్టిబొమ్మ దహనం

హసన్‌పర్తి: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. హనుమకొండ - కరీంనగర్ ప్రధాన రహదారిలోని ఎర్రగట్టు గుట్ట వద్ద డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శనివారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు మంద సుచందర్ మాట్లాడుతూ బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ 49 రోజులుగా ఢిల్లీలో రెజ్లర్లు ఆందోళన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ ఉమెన్స్ విభాగం రాష్ట్ర కోకన్వీనర్ మౌనిక, నాయకులు రమేష్, చందు, సంతోష్, హరికృష్ణ, వినోద్, సురేష్, రేణుక, యాదలక్ష్మి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

రెజ్లర్లపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి

ఖిలా వరంగల్: రెజ్లర్లపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) నేత బాలరాజు డిమాండ్ చేశారు. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్‌ను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో రైతు నేత వీరగోని శంకరయ్య అధ్యక్షతన రైతు సంఘాల సమావేశం శనివారం జరిగింది. సమావేశంలో ఇస్మాయిల్, సూరి, రాజయ్య, ఎలేందర్, లాదెళ్ల శరత్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు బీజేపీ నేతల నివాళి



రైలు ప్రమాద మృతులకు సంతాపం ప్రకటిస్తున్న బీజేపీ నాయకులు

హన్మకొండ: ఒడిస్సా రాష్ట్రం బాలాసోర్‌లో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మృతి చెందిన ప్రయాణికులకు బీజేపీ నాయకులు నివాళి అర్పించారు. హనుమకొండ దీన్‌దయాల్ నగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ ఆధ్వర్యంలో పలువురు నాయకులు మౌనం పాటించి మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రావు పద్మ మాట్లాడుతూ ఇది బాధిత కుటుంబాలకు అండగా నిలవాల్సిన సమయం అని గుర్తుచేశారు.

యోగాతో ఆత్మవిశ్వాసం పెంపు



యోగాసనాలు వేస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్లు, వాకర్లు

హన్మకొండ చౌరస్తా: క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం వలన ఆత్మవిశ్వాసం పెరుగుతుందని 58వ బెటాలియన్ సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ ఎం.మోహన్ అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో శనివారం యోగా సాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా గురువు మొగిలయ్య పర్యవేక్షణలో సాగిన కార్యక్రమంలో పబ్లిక్ గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్, బాధ్యులు లింగారెడ్డి, విజయ్‌కుమార్, చంద్రమౌళి, గిరిజ, భారతి, చంద్రశేఖర్, అశోక్, రాజేందర్‌రెడ్డి, 2వ కమాండెంట్లు మణిజి.నాయర్, డిప్యూటీ కమాండెంట్ సుమ, తులసి, ధనసాయి, లక్ష్మి పాల్గొన్నారు.

5, 6తేదీల్లో కళాభారతి స్వర్ణోత్సవాలు



ఆహ్వాన పత్రికలను ప్రదర్శిస్తున్న సంస్థ బాధ్యులు

నయీంనగర్: కళాభారతి సాంస్కృతిక సంస్థ 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 5, 6తేదీల్లో ఆరెపల్లిలో స్వర్ణోత్సవాలు నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు బుద్దె సాంబయ్య తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ 1971లో స్థాపించి ఇప్పటివరకు సాంఘిక, సామాజిక, సాంస్కృతిక సందేశాత్మకమైన నాటకాలను నిరంతరంగా ప్రదర్శిస్తున్నట్లు వివరించారు. స్వర్ణోత్సవాలకు ముఖ్యఅతిథులుగా మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, వి.శ్రీనివాస్ గౌడ్, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్యేలు, తదితరులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో రామోజు సుందర మూర్తి, రవీందర్ రావు, జనగాం కుమారస్వామి, బుద్దె గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల బంద్ పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రేషన్ డీలర్లు

హన్మకొండ చౌరస్తా: రేషన్ డీలర్లకు కనీస గౌరవ వేతనం నెలకు రూ.30 వేలు ఇవ్వాలన్న ప్రధాన డిమాండ్‌తో ఈనెల 3వ తేదీ నుంచి రేషన్ దుకాణాల నిరవధిక బంద్ పాటిస్తున్నట్లు తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్‌బాబు తెలిపారు. ఈమేరకు హనుమకొండ జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమం సంఘం బాధ్యులతో కలిసి 5వ డివిజన్ పరిధి రెడ్డికాలనీలోని శారదా గార్డెన్‌లో 'రేషన్‌షాపుల బంద్' వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలగాని మోహన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పోతరాజ రమేష్, బత్తుల మహేష్‌బాబు, గడ్డం సర్వేశం, కొలిపాక రాజ సాంబయ్య, విజయ్‌పాల్, వెంకటేశ్వర్లు, సతీష్, రాజ్యలక్ష్మి, తిరుపతి, గౌరీశంకర్, దేవేందర్, సదయ్య, రాజ్‌కుమార్, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

గోల్డ్‌మెడల్ గ్రహీత కృష్ణమూర్తికి సన్మానం



కృష్ణమూర్తిని, శ్రీనివాస్‌రావును సన్మానిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు, నాయకులు

కాజీపేట రూరల్: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన హనుమకొండ జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడు కృష్ణమూర్తిని, వరంగల్ జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శ్రీపాద శ్రీనివాస్‌రావును కాజీపేట రైల్వే ఇన్‌స్టిట్యూట్ ప్రాంగణంలో పలువురు శనివారం సన్మానించారు. హనుమకొండ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అనుమాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మర్యాల కృష్ణ, సిరిల్‌లారెన్స్, సునీల్, మహబూబ్‌ఖాన్, కోటేశ్వర్, సదానందం, ఎం.రవీందర్, ఓ.సారంగం, కె.వెంకటేశ్వర్లు, సీహెచ్.కొమ్మాలు, రమేష్, రాజ్‌కుమార్, నర్సింగరావు, గడప రాజయ్య, బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేపట్నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

కాశోజీ సెంటర్: ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు ఈనెల 5 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు శనివారం వరంగల్ డీఐఈఓ కాక మాధవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలు వరంగల్‌లోని రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. రెండు విడతలుగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు ఉంటాయని వివరించారు. సంబంధిత కాలేజీ ప్రిన్సిపాళ్ల నుంచి హాల్ టికెట్ తీసుకుని పరీక్షలకు విద్యార్థులు హాజరు కావాలని సూచించారు.

అధునాతన పద్ధతులపై అవగాహన



బహుమతులు ప్రదానం చేస్తున్న రవీందర్‌రెడ్డి

వరంగల్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఏనుమాముల మార్కెట్ ఆవరణలో మన అగ్రిటెక్ ఆధ్వర్యంలో శనివారం రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దయాకర్‌రావు, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్యేలు అరూరి రమేష్, నన్నపునేని నరేందర్, కలెక్టర్ ప్రావీణ్య పాల్గొని మన అగ్రిటెక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లక్కీడిప్‌ను తీశారు. ఈ సందర్భంగా వారు సంస్థ ఎండీ పాశికంటి రమేష్ అభినందించారు. అనంతరం, 10మంది విజేతలను సన్మానించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, కమిటీ సభ్యులు గాంధీ, పిన్నింటి వెంకట్రావు, విజయకుమార్, రాజయ్య, మార్కెట్ కార్యదర్శి రాహుల్, సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో నేడు.. రేపు

నేడు కేంద్ర మంత్రి బీఎల్ వర్మ పర్యటన

హన్మకొండ: కేంద్ర సహకార, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి సహాయ మంత్రి బీఎల్.వర్మ పర్యటన ఈనెల 4న యథావిధిగా సాగనుందని బీజేపీ శ్రేణులు తెలిపాయి. ఒడిస్సా బాలసోర్‌లో జరిగిన ఘోర రైలు ప్రమాదం నేపథ్యంలో రైలు ప్రమాద మృతులకు సంతాపసూచకంగా దేశవ్యాప్తంగా బీజేపీ కార్యక్రమాలను బీజేపీ జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా రద్దు చేశారు. ఈక్రమంలో శనివారం జరగాల్సిన హనుమకొండ, భూపాలపల్లి, వరంగల్ జిల్లాల పర్యటన రద్దయింది. అయితే, ఆదివారం పర్యటన కొనసాగుతుందని బీజేపీ నాయకులు తెలిపారు.
గీసుకొండ: వరంగల్ జిల్లాలోని గీసుకొండ–సంగెం మండలాల పరిధి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ)ను కేంద్ర ఈశాన్య ప్రాంత అభివృద్ధి, సహకార శాఖ సహాయ మంత్రి బీఎల్ వర్మ ఆదివారం సందర్శించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

బొమ్మల కట్టయ్య యాది సభ

నయీంనగర్: దళితరత్న బొమ్మల కట్టయ్య యాది సభను హనుమకొండ జెడ్పీ హాల్‌లో ఆదివారం ఉదయం నిర్వహించనున్నట్లు ఎస్సీ స్టడీ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి, అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అయిలయ్య తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. సమావేశంలో రౌతు రమేష్, బొమ్మల అంబేడ్కర్, సురేందర్, రవీందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎంసీపీఐయూ రాష్ట్ర ప్లీనరీ సభలు

కాశిబుగ్గ: నర్సంపేటలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్న ఎంసీపీఐ (యూ) రాష్ట్ర ప్లీనరీ సభలను విజయవంతం చేయాలని పార్టీ కాశిబుగ్గ ఏరియా కార్యదర్శి గోవర్దన్ రాజ్ పిలుపునిచ్చారు. సభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను కాశిబుగ్గ పార్కులో శనివారం ఆవిష్కరించారు.

ఘనంగా రైతు దినోత్సవం

రైతు దినోత్సవాన్ని నగరవ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ సిద్ధించి తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు శనివారం రైతు దినోత్సవాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఎడ్ల బండిపై వస్తున్న మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, కలెక్టర్ ప్రావీణ్య, ఎమ్మెల్యే నరేందర్



హసన్‌పర్తి: సిద్దాపురం రైతు వేదికకు ఎడ్లబండ్లపై వస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేష్, తదితరులు



వ్యవసాయ కళాశాలలో ఉత్సవాలను ప్రారంభిస్తున్న మరియపురం సర్పంచ్ బాలిరెడ్డి



హసన్‌పర్తి: మాట్లాడుతున్న రైతు బంధు సమితి హనుమకొండ జిల్లా కోఆర్డినేటర్ లలితాయాదవ్



మడికొండలో రైతు వేదికపై కార్పొరేటర్ రాధికారెడ్డి, అధికారులు, తదితరులు

సంక్షిప్తంగా

పిల్లల హక్కులకు చైల్డ్ హెల్ప్‌లైన్ భరోసా

కాజీపేట: బాలబాలికల హక్కుల పరిరక్షణకు చైల్డ్ హెల్ప్‌లైన్ ఎంతో భరోసా అని చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా టీం సభ్యుడు బెజ్జంకి ప్రభాకర్ తెలిపారు. ఈమేరకు చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలపై కాజీపేట చౌరస్తాలో శనివారం ప్రచారం నిర్వహించారు. బాల బాలికలు ఆపదలో ఉన్నప్పుడు 1098 నంబర్‌కు ఫోన్ చేసి వారికి తక్షణ రక్షణ కల్పించాలని కోరారు.

చైర్మన్ పదవిని మత్స్యకారులకే కేటాయించాలి

నయీంనగర్: రాష్ట్ర మత్స్యకార ఫెడరేషన్ చైర్మన్ పదవిని సంప్రదాయ మత్స్యకారులైన గంగపుత్రులు, బెస్తలకే కేటాయించాలని తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గైని రవీందర్ డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సాయిబాబా, ఎం.ప్రవీణ్, క్రాంతికుమార్, ఎం.గణేశ్, డి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

హన్మకొండ: జాతీయస్థాయి మినీ సబ్ జూనియర్ నేషనల్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు హనుమకొండలోని సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈమేరకు పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు పోలెపాక విరి, పోలెపాక విల్ ఉన్నవ్, పోలెపాక విష్ ఉన్నవ్‌ను సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ జి.సునీతారెడ్డి అభినందించారు.

క్విజ్ విజేతలకు నగదు బహుమతి

నయీంనగర్: చైతన్య (డీమ్డ్ టు బీ విశ్వవిద్యాలయం) ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన క్విజ్ చివరి ఎపిసోడ్‌లో టీటీడబ్ల్యూఆర్‌ఎఎఫ్‌పీడీసీ నర్సంపేట కళాశాలకు చెందిన దుర్గం సాయివర్ధన్, రమావత్ పవన్ విజేతలుగా నిలిచారు. వారికి ఓఎస్‌డీ కె.వీర వెంకటయ్య రూ. లక్ష చెక్కును బహుమతిగా అందజేశారు.

ఉపాధ్యాయులే భావిభారత నిర్మాతలు

వరంగల్: ఉపాధ్యాయులే భావిభారత నిర్మాతలని కర్ణాటక మాజీ ప్రభుత్వ కార్యదర్శి రత్నప్రభ అన్నారు. నగరంలోని ఒయాసిస్ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులకు విద్యా విధానంపై పాఠశాలల చైర్మన్ పరంజ్యోతి అధ్యక్షతన శనివారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రత్నప్రభ మాట్లాడుతూ ఉపాధ్యాయుల నడవడిక, వారి ప్రభావం విద్యార్థులపై ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త సురేష్‌కుమార్, ఫార్మా కంపెనీ యజమాని జన్ను చిరంజీవి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి పర్యటన

ఖిలా వరంగల్: వరంగల్ 34వ డివిజన్ శివనగర్‌లో కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు చిట్టిమల్ల శ్రీనివాస్‌రావు ఇంటికి ఆయన తేనేటి విందుకు వెళ్లారు. అక్కడ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ పరిస్థితిపై శ్రీనివాస్‌తో చర్చించారు. కార్యక్రమంలోటీ పీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, నల్గొండ రమేష్, ఆకుతోట సదానందం, మడిపెల్లి కృష్ణ, గజ్జల లింగమూర్తి, మంతెన సునీత, దాసరి రాజేష్, సాజిద్, మురళి, ఖలీల్, రేణికుంట్ల శివ, గోరేమియా, కార్యకర్తలు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు సేవ అభినందనీయం

హన్మకొండ అర్బన్: మానసిక దివ్యాంగులను చేరదీసి వారికి సేవచేస్తున్న మల్లికాంబ నిర్వాహకులు అభినందనీయులని వరంగల్ రూరల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి కొనియాడారు. గండ్ర జ్యోతి తన జన్మదిన వేడుకలను హనుమకొండలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో శనివారం జరుపుకున్నారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మీడియా కన్వీనర్‌గా విల్సన్

కాజీపేట అర్బన్: ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర మీడియా కన్వీనర్‌గా కాజీపేట మండలంలోని అయోధ్యపురం గ్రామానికి చెందిన జెరిపోతుల విల్సన్ మాదిగను నియమిస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు బీఎస్.రమేష్‌కుమార్ మాదిగ, ఉపాధ్యక్షుడు మోదుగు లాజర్‌మాదిగ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కాశిబుగ్గ: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. శివనగర్ సాయి కన్వెన్షన్ హాల్‌లో వరంగల్ తూర్పు నియోజకవర్గ వడుప్సా నాయకులతో శనివారం సాయంత్రం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడప్సా భవనానికి దేశాయిపేటలో స్థలం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో వడుప్సా నాయకులు యాదగిరి, శేఖర్‌రావు, పరంజ్యోతి, కొమ్మినేని భూపాల్‌రావు, వెంకటేశ్వర్లు, జ్ఞానేశ్వర్‌సింగ్, బిక్షపతి, కొడెం శ్రీధర్, రవీందర్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కాజీపేట అర్బన్: గ్రేటర్ వరంగల్ 31వ డివిజన్ న్యూశాయంపేటలోని సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ మామిండ్ల రాజు కోరారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాకు శనివారం వినతిపత్రం అందజేశారు.

ఈతకు వెళ్లిన వ్యక్తికి గాయాలు

మామునూరు: ఈతకు వెళ్లిన ఓ యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన వరంగల్ ఆర్టీఏ జంక్షన్ సమీపంలోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో సిమ్మింగ్‌పూల్‌లో శనివారం జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. వరంగల్ కీర్తినగర్‌కు చెందిన ఎండీ.ఫిరోజ్.. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం స్కూల్ ప్రాంగణంలోని సిమ్మింగ్‌పూల్‌లో ఈత నేర్చుకుంటున్న క్రమంలో తుప్పు పట్టిన చువ్వ అతడి కాలుకు గుచ్చుకోవడంతో గాయమైంది. యువకుడు ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడు. స్విమ్మింగ్ పూల్ నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా ఫిరోజ్ గాయాలపాలయ్యాడని పలువురు విమర్శించారు.

పోలీసుల 'సురక్షా' ఏర్పాట్ల పరిశీలన

కరీమాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పోలీస్ 'సురక్షా' దినోత్సవ ఏర్పాట్లను వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆదివారం పరిశీలించారు.

మంత్రి హరీశ్‌రావు జన్మదిన వేడుకలు

హన్మకొండ: రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావుకు బీఆర్‌ఎస్ నేతలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు హైదరాబాద్ నార్సింగిలోని స్వగృహంలో మంత్రిని శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, నాయకుడు భరత్‌కుమార్ రెడ్డి ఉన్నారు.
హన్మకొండ చౌరస్తా: మంత్రి తన్నీరు హరీశ్‌రావు జన్మదిన వేడుకలను రెడ్డికాలనీలోని అతిథి మనోవికాస కేంద్రంలో దివ్యాంగుల మధ్య బీఆర్‌ఎస్ నాయకులు నిర్వహించారు.